








సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

బుధవారం 11-9-2024

సంపుటి: 20 సంచిక: 144
పేజీలు: 4 వెల: రూ.1

## జాతీయ తైక్వాండో పోటీల్లో సత్తా చాటాలి




4లో

# వారికి ఆక్వా కాసుల మేత..
# తీరగ్రామాలకు గుండెకోత



నాగావళి నది సముద్రంలో కలిసే ప్రాంతం పూర్తిగా కోతకు గురై నదీప్రవాహ దిశ పూర్తిగా మారిపోయిందని, దీనికి తక్షణ పరిష్కారం చూపించాలని గత నెల 28న జరిగిన జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. నదీ ప్రవాహ దిశ మారడానికి పెద్దగనగళ్లపేట వద్ద అక్రమంగా నిర్మించిన రొయ్యల చెరువులే కారణమని కూడా ఆయన ప్రస్తావించారు. ప్రవాహ దిశ మారడం వల్ల తీర ప్రాంతాల్లో ఉన్న గ్రామాలకు ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని పలు నాగావళి తీర గ్రామాల్లో ఆక్వా సాగు పెరిగింది. నదీసాగర సంగమ ప్రాంతంలో సీఆర్‌జెడ్ నిబంధనలను ఉల్లంఘించి శ్రీకాకుళానికి చెందిన పలువురు రాజకీయ నాయకులు రొయ్యల చెరువులు తవ్వించి ఆక్వాసాగు ద్వారా దండిగా లాభాలు ఆర్జిస్తున్నారు. దీనిపై మత్స్యకార సంఘాలు ఆందోళనలు చేసినా, అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా అక్రమ చెరువులకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులు ముందుకు రావడంలేదు.

- అక్రమ రొయ్యల చెరువులతో దిశ మార్చుకున్న నాగావళి
- గ్రామాలను వరద ముంచెత్తుతుందని స్థానికుల ఆందోళన
- కోర్టు స్టేల పేరుతో పబ్బం గడుపుకుంటున్న అక్రమార్కులు
- నామమాత్రపు తొలగింపులతో సహకరిస్తున్న అధికారులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


ఆక్వా రైతుల ముసుగులో నగరానికి చెందిన కొందరు వ్యాపారులు, రాజకీయ నాయకులు నాగావళి ప్రవాహ మార్గంలోనే చెరువులు నిర్మించి రొయ్యల సాగు చేస్తున్నారు. రమేష్, వాసు, రాము, జగపతి, సూర్యనారాయణ, సుధ అనే వ్యక్తులు ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వీరంతా వైకాపా, టీడీపీ నాయకులతో చెలిమి చేస్తూ చెరువులను తొలగించే ప్రక్రియను అడ్డుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నాలుగేళ్ల క్రితం కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో జాలారిపేట వద్ద బంగాళాఖాతంలో నాగావళి నది కలిసే ప్రాంతాల్లో భారీ యంత్రాల సాయంతో చెరువులు తవ్వించారు. చేపల వేటే తమ జీవనాధారమని.. పెద్దగనగళ్లపేట, మోపసుబందర్, జాలరిపేటల్లో నివాసం ఉంటున్నట్టు చూపించి మత్స్యకార సంఘం పేరుతో సుమారు 100 ఎకరాలు ఆక్రమించి 70కి పైగా చెరువులు తవ్వేశారు. ఈ భూమి కోస్టల్ రెగ్యులేటరీ జోన్(సీఆర్‌జెడ్)లో ఉన్నట్టు రెవెన్యూ రికార్డుల్లో ఉన్నా వీరంతా మత్స్యకారుల ముసుగు వేసుకొని ఆ భూమి తమ సాగులో ఉన్న అసైన్డ్‌ల్యాండ్‌గా న్యాయస్థానాన్ని నమ్మించేందుకు ప్రయత్నించారు.

### తూతూమంత్రంగా తొలగింపులు

శ్రీకాకుళం రూరల్ మండలం పరిధిలో 16 రొయ్యల చెరువులకే కోస్టల్ రెగ్యులేటరీ అనుమతులు ఉన్నాయి. మిగతా చెరువులన్నీ అక్రమంగా నిర్వహిస్తున్నవేనని స్వయంగా మత్స్యశాఖ అధికారులే న్యాయస్థానానికి రెండుసార్లు నివేదించారు. అయినా ఆక్రమణదారులు న్యాయస్థానాన్ని ఆశ్రయించి ఏదో ఒక విధంగా ఆక్రమణలను తొలగించకుండా అడ్డుకోవడానికి ప్రయత్నాలు చేస్తూ వచ్చారు. ఆక్రమణదారులకు ప్రభుత్వం ఇచ్చిన గడువు ముగియడం, హైకోర్టు కూడా స్టే ఇవ్వడానికి నిరాకరించడం, చెరువులను తక్షణమే తొలగించాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సైతం ఆదేశించడంతో గత ఏడాది ఆగస్టులో రెవెన్యూ, పోలీసు అధికారులు అక్రమ చెరువుల తొలగింపు ప్రక్రియను చేపట్టారు. కానీ అది తూతూమంత్రంగానే జరిగింది. రెవెన్యూ అధికారులు యంత్రాల సాయంతో రోడ్డుకు సమీపంలో ఉన్న చెరువు గట్లను మాత్రమే కొంతమేర తొలగించి మిగతావాటిని విడిచిపెట్టేశారు. దీనికి ఆర్థికపరమైన సమస్యలతో పాటు చెరువులను పూర్తిస్థాయిలో తొలగించే అవకాశం లేకపోవడం కారణమని చెబుతున్నారు. పెద్దగనగళ్లపేట పరిధిలో అక్రమంగా చెరువుల తవ్వకాలు జరిపి

- మిగతా 4లో



• ఎడిటోరియల్

# సంక్షేమ సంక్షోభంలో మరో రాష్ట్రం

ప్రజా సంక్షేమం పేరుతో అనుత్పాదక పథకాలకు వేల కోట్ల రూపాయలు మళ్లించడం వల్ల జరిగే చేటు ఏమిటో? అటువంటి నిర్ణయాల వల్ల ఎటువంటి దుర్భర పరిస్థితి ఏర్పడుతుందన్నది ఇప్పటికే అనేక సందర్భాల్లో అనుభవంలోకి వచ్చింది. అయినా పార్టీలు అధికారం కోసం ఓటు బ్యాంకు రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తూ పేదలకు నగదు బదిలీ పేరుతో అనేక రకాల సంక్షేమ పథకాలు తెస్తామని ఎన్నికల్లో వరాల వర్షం కురిపిస్తున్నాయి. కానీ అధికారంలోకి వచ్చాక ఖజానాకు పెనుభారంగా మారిన ఆ వరాలను అమలు చేయలేక ఆపోసోపాలు పడుతున్నాయి. రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసేయడంతోపాటు అప్పుల పాల్జేసేస్తున్నాయి. దీనికి తాజా ఉదాహరణ హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రం. ప్రస్తుతం ఈ రాష్ట్రం కాంగ్రెస్ పాలనలో ఉంది. గత కొన్నేళ్లుగా కేంద్రంలోనూ, దేశంలోనూ మెజారిటీ రాష్ట్రాల్లోనూ అధికారం కోల్పోయిన ఆ పార్టీ గ్యారెంటీ హామీల పేరుతో కొత్త ఎత్తుగడలు వేసి ప్రజలను ఆకట్టుకుని వారి మద్దతును ఓట్ల రూపంలో కొల్లగొడుతోంది. ఈ వ్యూహాన్ని హిమాచల్ ప్రదేశ్‌లోనే అమలు చేసి ఆ రాష్ట్రంలో పాగా వేసింది. 2022 చివరిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలను ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ ఏకంగా పది గ్యారెంటీలను ప్రకటించింది. 18 ఏళ్లు నిండిన మహిళలందరికీ నెలకు రూ.1500 భృతి, ప్రతి గృహానికి నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ప్రభుత్వ ఉద్యోగులకు పాత పింఛన్ స్కీం పునరుద్ధరణ తదితర హామీలు ఈ పది గ్యారెంటీల్లో ఉన్నాయి. వాటి ప్రభావంతో హిమాచల్‌ప్రదేశ్‌లో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన గ్యారెంటీలు అమలు చేయలేక చేతులెత్తేస్తోంది. రాష్ట్ర ఖజానా ఖాళీ కావడం, అప్పులు పెరిగిపోవడంతో వేరే మార్గం లేక సుఖ్‌విందర్ సింగ్ సుక్కు నేతృత్వంలోని రాష్ట్ర సర్కారు గతంలో తాము ఇచ్చిన హామీలకు, ఇతర సబ్సిడీ పథకాలకు కత్తెర వేసే పని మొదలుపెట్టింది. కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీలు రాష్ట్రాన్ని దివాలా అంచున నిలబెట్టాయి. దేశంలో తలసరి రుణం అధికంగా ఉన్న రాష్ట్రాల్లో హిమాచల్‌ప్రదేశ్ రెండో స్థానంలో ఉంది. ఆ రాష్ట్రంలో సగటున ఒక్కో వ్యక్తి తలపై రూ.1.17 లక్షల అప్పు ఉంది. అలాగే రాష్ట్ర ప్రభుత్వ అప్పులు రూ.86,589 కోట్లకు ఎగబాకాయి. ఒక చిన్న రాష్ట్రానికి ఇంత భారీ అప్పులు ఉండటం నిజంగా ఆందోళన కలిగించే అంశమేనని ఆర్థికవేత్తలు వ్యాఖ్యానిస్తున్నారు. అప్పుల భారం పెరిగిపోవడంతో కొత్త అప్పులు పుట్టే పరిస్థితి లేకుండాపోయింది. కేంద్రం కూడా కొత్త అప్పులపై ఆంక్షలు విధించింది. దాంతో ఖర్చులు తగ్గించడం, సంక్షేమ పథకాలకు ఇస్తున్న సబ్సిడీలను కట్ చేయడంపై ప్రభుత్వం అనివార్యంగా దృష్టి సారించాల్సి వస్తోంది. మంత్రుల జీతాల చెల్లింపులను రెండు నెలలు వాయిదా వేశారు. ప్రతి ఇంటికి 300 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తామన్న హామీని కాంగ్రెస్ సర్కారు ఇప్పటికీ అమలు చేయలేదు. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో దాన్ని అమలు చేస్తే పుట్టి మునుగుతుందని భావించి కేవలం బీపీఎల్ కుటుంబాలకు మాత్రమే అది కూడా 125 యూనిట్ల వరకే ఉచిత విద్యుత్ అందించాలని నిర్ణయించింది. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కుదించి సగం ఛార్జీలు వసూలు చేయాలని ఆదేశించింది. ఉచిత తాగునీటి సరఫరా పథకానికి కూడా నీళ్లొదిలేసింది. మొత్తంగా 14 సంక్షేమ పథకాలకు ఇస్తున్న సబ్సిడీలను కోత పెట్టే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. హిమాచల్‌ప్రదేశ్‌లో మొదలుపెట్టిన గ్యారెంటీ పథకాల వ్యూహం వర్కౌట్ కావడంతో ఆ తర్వాత జరిగిన కర్ణాటక, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లోనూ అదే ఫార్ములా అనుసరించి అధికారం చేజిక్కించుకున్న కాంగ్రెస్‌కు ఆ రాష్ట్రాల్లోనూ ఇప్పుడు అవే చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. గ్యారెంటీ పథకాల అమలు పెనుభారంగా మారడంతో కర్ణాటకలోని సిద్ధరామయ్య ప్రభుత్వం ధరలు పెంచి ఖజానా నింపడానికి సిద్ధమైంది. గ్యారెంటీ పథకాలను పున:సమీక్షించాలని కాంగ్రెస్‌లోనే పలువురు డిమాండ్ చేస్తుండటం విశేషం. తెలంగాణలోనూ దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. గ్యారెంటీ హామీల పుణ్యాన తెలంగాణ ఏర్పాటైన పదేళ్లకు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు.. పది నెలలు గడిచినా ఇంతవరకు ఎన్నికల్లో ఇచ్చిన చాలా హామీలను అమలు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తోంది. ఆర్థిక ఇబ్బందులే దీనికి కారణమని వేరే చెప్పనక్కర్లేదు. కాంగ్రెస్ ప్రభుత్వాల ఇబ్బందుల సంగతి పక్కన పెడితే.. మూడు నెలల క్రితం సార్వత్రిక ఎన్నికలతోపాటు అసెంబ్లీ ఎన్నికలు కూడా జరిగిన ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, బీజేపీ, జనసేనలతో కూడిన ఎన్డీయే కూటమి కూడా ఇతర రాష్ట్రాల్లో కాంగ్రెస్ అనుసరించిన వ్యూహాన్నే ఫాలో అయ్యింది. తాను కూడా సూపర్ సిక్స్ పేరుతో ఆరు గ్యారెంటీ పథకాలు ప్రకటించింది. ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే వాటిలో ఒకటైన సామాజిక పెన్షన్ల పెంపును అమల్లోకి తీసుకొచ్చింది. కానీ మిగతా పథకాల ఊసెత్తడంలేదు. మిగతా రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఇచ్చినట్లే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి ప్రతి ఇంటికి మూడు ఉచిత సిలెండర్లు, 18-59 ఏళ్ల మధ్య ఉన్న మహిళలకు నెలకు రూ.1500 భృతి, నిరుద్యోగ భృతి వంటి గ్యారెంటీ హామీలు ఇచ్చినా ఇప్పటికీ వాటిని అమలు చేసేందుకు కనీసం గ్రౌండ్ వర్క్ కూడా చేపట్టడంలేదు. 'ఎన్నికల్లో చాలా హామీలు ఇచ్చాం.. కానీ ఏం చేద్దామన్నా ఆర్థిక పరిస్థితి సహకరించడంలేదు' అని సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబే ఆ మధ్య నిస్సహాయతను సూచించే వ్యాఖ్యలు చేశారు. ఈలోగా రాష్ట్రంలో వరదలు సంభవించి ఆర్థికంగా మరింత నష్టం వాటిల్లింది. సంక్షేమ పథకాల విషయంలో గత వైకాపా ప్రభుత్వాన్ని విమర్శించిన ఎన్డీయే కూటమి.. ఎన్నికల్లో మాత్రం అధికారం కోసం దానికి మించి అన్నట్లు సూపర్‌సిక్స్ ప్రకటించింది. చిత్రమేమిటంటే సబ్సిడీ, సంక్షేమ పథకాలకు వ్యతిరేకమని చెప్పుకొనే బీజేపీ కూడా ఏపీకి వచ్చేసరికి వాటికే జైకొట్టింది.



ఇబ్రహీం అల్ హుస్సేనీ హమాద్టో.. ఈయన చూసేవాళ్ల కళ్లకు మాత్రమే వికలాంగుడు. కానీ ఆయన ఆట మొదలెట్టాడంటే ప్రత్యర్థి కంటే బలవంతుడు. ఆయన జీవితంతో పాటే ఆయనాడే టేబుల్ టెన్నిస్‌లో ఓటములుండొచ్చు. కానీ ఆ ఓటములైనా.. విజయం సాధించిన అజేయులను మించి ఆశ్చర్యపర్చడం ఇబ్రహీం ఆటలో కనిపించే మెస్మరైజేషన్. ఇబ్రహీం అలా ఓటమి వైపే ఒదిగిపోయిన రకం కాదు. మూడు సిల్వర్ మెడల్స్‌ను సాధించి ప్రపంచంలో ఛాంపియన్‌గా ఎదిగిన టేబుల్‌టెన్నిస్ ప్లేయర్. ఇప్పుడెందరో నవయువత వివిధ రకాలో గేమ్స్‌లో భాగంగా ఒలింపిక్స్‌లోకి ఎంటరై సత్తా చాటుతున్న వేళ.. ఇబ్రహీం స్టోరీ ఓ ఇన్స్పిరేషన్.

జస్ట్ పదేళ్ల వయస్సులో రైలు ప్రమాదంలో తన రెండు చేతులూ కోల్పోయాడు ఈ ఈజిప్షియన్ ఇబ్రహీం. వాస్తవానికి ఇబ్రహీంకు చిన్ననాటి నుంచే క్రీడలంటే ఉన్న అమితాసక్తితో ఫుట్ బాల్ ప్లేయర్ కావాలని ఉత్సాహపడ్డాడు. కానీ విధి వక్రించే సరికి.. రెండు చేతులూ కోల్పోయిన ఇబ్రహీంకు.. తన సాకర్ కల నెరవేరలేదు. అయినా, నిరాశతో వెనకడుగు వేయకుండా రెండు చేతులేకుంటే ఏం? అని నోటితో రాకెట్‌ను కర్చుకుని టేబుల్ టెన్నిస్ ప్రాక్టీస్ మొదలెట్టాడు. గతంలో జరిగిన ప్యారా ఒలంపిక్స్‌లోనూ తన ఆటతో జనాన్ని సమ్మోహనపర్చాడు. ఇప్పుడు ఒలింపిక్స్‌తో పాటు.. ఆగస్ట్ నుంచి సెప్టెంబర్ వరకూ జరుగబోయే ప్యారా ఒలింపిక్స్‌లోనూ మళ్లీ జయకేతనం ఎగురేయాలని ఉవ్విళ్లూరుతున్నాడు.

# పేరుకే వికలాంగుడు.. ఆటలో బలవంతుడు!

ఏ అంశమైతే హాట్ టాపిక్‌గా మారుతుందో దేనికైతే క్రేజ్ ఎక్కువ ఉంటుందో దేనికైతే రేటింగెక్కువో వాటి గురించే మాట్లాడే సమాజం మనది. అందుకే ఒలింపిక్స్‌పై జరిగినంత చర్చ సమాజంలో ప్యారా ఒలంపిక్స్‌పై కనిపించదు. కానీ ప్యారా ఒలింపిక్స్‌కు ఎన్నికై అక్కడ ఆడిన ప్రతీ ఆటగాడూ ఓ మెరుపు తునకే. ఓ తురుపుముక్కే. అందులోనూ అందరినీ ఆకట్టుకున్న టెబుల్ టెన్నిస్ ఆటగాడు. ఇబ్రహీం అల్ హుస్సేనీ హమాద్టో మరింత ప్రత్యేకం. ఎందుకంటే తన పదేళ్ల వయస్సులో రెండు చేతులను పూర్తిగా కోల్పోయిన ఇబ్రహీం ఇవాళ 4 పదుల వయస్సు తర్వాత కూడా ఇంకా ప్యారా ఒలంపిక్స్‌లో వీక్షకులకు కనువిందు చేస్తూనే ఉన్నాడు. సుదూరమైన ఆయన క్రీడా ప్రయాణం.. అంతే పట్టు సడలని ఉక్కు సంకల్పంతో సాగుతున్న తీరు.. కాళ్లూ, చేతులు బాగుండి కేవలం ఏకాగ్రతతో కూడిన సంకల్పబలం కావల్సిన వాళ్లకు ఓ స్ఫూర్తి

2011, 2013 ఆఫ్రికన్ ఛాంపియన్‌షిప్‌లతో పాటు.. 2013 ఈజిప్ట్ ఓపెన్‌లో కలిపి మూడు రజతాలను సాధించాడు హమాద్టో. రాకెట్‌ను నోటితో పట్టుకుని కాళ్ల వేళ్ల మధ్య బంతినుంచి నేర్పుగా టేబుల్ టెన్నిస్ ఆడే ఇబ్రహీం ఆటతీరు ఒక విజువల్ వండర్. ఇబ్రహీం తన రైలు ప్రమాదం తర్వాత ఈ సమాజం చూపించే సానుభూతి, జాలి వంటి నెగటివిటీని తట్టుకోలేకపోయాడు. కొంతకాలం కేవలం రాత్రి వేళల్లో మాత్రమే బయటకొచ్చేవాడు. ఇవాళ తనాడుతున్నప్పుడు కేవలం తన కన్వర్సేషన్‌ను బాల్‌తో మాత్రమే చేయగల్గేంత ఏకాగ్రతను సాధించాడు. అందుకే టేబుల్ టెన్నిస్ ఆడుతున్నప్పుడు ఎదురుగా ఎంత గొప్ప ప్రత్యర్థి ఉన్నా ప్రేక్షకుడికి మాత్రం హమాద్టోనే కింగ్ లా కనిపిస్తుంటాడు.

అయితే ఇద్దరు మిత్రుల ఇన్స్పిరేషనే ఇబ్రహీంను ఇవాళ స్టార్ ప్లేయర్‌గా వార్తల్లో నిలిపింది. అందులో ఒకరు నెగటివ్ మోడ్‌లో ఇబ్రహీంలో కసి పెంచితే ఇంకొకరు తనను వెన్ను తట్టి ప్రోత్సహించిన వ్యక్తి. అప్పటివరకూ స్నేహితులతో ఫుట్‌బాల్ ఆడుతూ హాయిగా గడిపిన జీవితంలో జరిగిన యాక్సిడెంట్‌తో చేతులు కోల్పోయినప్పుడు నువ్విక జీవితంలో ఎప్పటికీ ఆడలేవన్న ఓ ఫ్రెండ్ మాటలు ఇబ్రహీంలో కసి పెంచాయి. నువ్వేదైనా దృష్టి సారిస్తే అదయ్యేంతవరకూ వద లని పట్టుదల నీలో ఉంది.. కాబట్టి, ప్రయత్నించు అంటూ మరో స్నేహితుడు భుజం తట్టిన తీరు ఇబ్రహీంలో ఉత్సాహాన్ని నింపింది. సో నెగటివిటీలోంచీ..

## సంకల్పం ముందు అంగవైకల్యం చిన్నదని చాటిన ప్యారా ఒలింపియన్!


పాజిటివిటీలోంచి..

అలా, రెండింట్లోంచీ పాజిటివిటీనే గ్రహించి ఇవాళ ఎందరికో ఓ పాజిటివ్ స్టోరీ అయ్యాడు. సంకల్ప బలం ముందు అంగవైకల్యమెంత చిన్నదో ప్రపంచానికి చాటాడు. అందుకే సవాళ్లకెదురీదేవారికిచ్చే మహ్మద్ బీన్ రషీద్ ఆల్ మక్తమ్ క్రియేటివ్ స్పోర్ట్స్ అవార్డ్ కూడా ఇబ్రహీంను వరించింది.

– రమణ కొంటికర్ల



1964 సంవత్సరం అనుకుంటాను. ఆదుర్తి సుబ్బారావు 'కన్నెమనసులు' చిత్రం నిర్మించే ప్రయత్నంలో నటించడానికి కొంతమంది నటీనటులను ఎంపిక చేసుకోవాలనుకున్నారు. ఆయన ఒకసారి 'పొన్నూరు'కు వచ్చి హెూటల్లో వున్నారని తెలిసి వెళ్లాను. నన్ను లోపలకు ఆహ్వానించి వచ్చిన విషయం కనుక్కొని- 'మీరు పనికొస్తారు వెంకటరావుగారు' అన్నారు. ఆ మాట నాకు గొప్ప ఉత్సాహాన్నిచ్చింది. స్క్రీన్ టెస్ట్ చేస్తాను, పలానా తేదీల్లో మద్రాసుకు రమ్మని చెప్పారు.. నేను తప్పకుండా వస్తానని ఆయనతో చెప్పి వచ్చేశాను. అయితే ఈ విష యం మా నాన్నగారికి చెప్పాను. ఆయన ఒప్పుకోలేదు. 'సినిమా అంటే ఎంతలేదన్నా ఐదారునెలలు పడు తుంది- ఒకవేళ ఆ చిత్రం అటూ ఇటూ పోతే పరిస్థితి ఏమిటి? నువ్వు కుటుంబాన్ని పోషించాలి- ఆ విషయం మర్చిపోకు' అని హెచ్చరిం చారు. అంతే ఆదుర్తిగారు చెప్పిన తేదీల్లో స్క్రీన్ టెస్ట్ హాజరుకాలేక పోయాను.



క్యారెక్టర్ ఆర్టిస్టు వేషాలు చెయ్యమని సలహా ఇచ్చాను. పోతే, చిరంజీవి తెలుగు సినిమారంగంలో నంబర్ వన్ స్థాయికి చేరుకుంటాడని నేను ఎప్పుడూ ఊహించలేదు. నాలో అణగారిపోయిన తృష్ణ-నా కొడుకు సాధించిన విజయాలలో చూసుకోసాగాను. ఒక మామూలు మధ్యతరగతి తండ్రిగా చిరంజీవి సాధించిన విజయాలు గొప్ప స్ఫూర్తినిస్తాయి. చిరంజీవి తల్లిదండ్రులుగా మాకు. సమాజంలో ఒక ప్రత్యేక గుర్తింపు, గౌరవం తీసుకొచ్చి పెట్టాడు. అంత కంటే ఏం కోరుకోమంటారు? ఇంతకంటే ఏం చెప్పమంటారు?

మెగాస్టార్ చిరంజీవి తండ్రి వెంకట్రావు 22 ఆగస్టు 1999 ఆంధ్రప్రభ ఆదివారంకు ఇచ్చిన ఇంటర్వ్యూ

మొదటినుంచి నేను ఆశావాదిని, క్రమబద్ధమైన జీవితం గడిపేవాడిని. ఉన్నదాంట్లో తృప్తి పడటం తప్ప, లేని దానికోసమో, రానిదాని కోసం ఎదురు తెన్నులు చూసేవాడిని కాదు. ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ చేసినా, పోలీసు అధికారిగా ఉన్నా, నీతి, నిజాయితీకే ప్రాధా న్యత నిచ్చేవాడిని. ఎప్పుడూ మనిషి శ్రమపడితే, సిన్సి యర్‌గా ఉంటే జీవితంలో నష్టపోవడం ఉండదనే నమ్మకం ఉన్న వాడిని. అలా ఉన్నవాడు విజయకేతనం ఎగురవేస్తాడని చెప్పడా నికి నిదర్శనమే చిరంజీవి. చిరంజీవికి ఓర్పు ఎక్కువ. కోపం అరుదుగా తప్ప రాదు. అలాగే ఇతరులను గౌరవించడం అత నికి బాగా తెలుసు. సంస్కారం అతనికి భూషణం. అలాగే టైమ్ అంటే టైమ్. తను చేస్తున్న పనిపట్ల శ్రద్ధ. ఏకాగ్రత, సమ యపాలన అతని విజయానికి కారణం అనుకుంటాను.



# నేను అనుకున్నది.. నా కొడుకు సాధించాడు!

అయితే ఆ తర్వాత 'సుడిగుండాలు' చిత్రం షూటింగ్ టైమ్లో కలిసినప్పుడు- వెంకటరావు నువ్వు వస్తే 'కన్నెమనసులు' చిత్రంలో గుమ్మడిగారు వేసిన విలన్ పాత్ర ఇద్దామని అనుకున్నాను. నువ్వురాలేదు అన్నారు. 'సుడిగుండాలు' చిత్రంలో ఏమైనా అవకాశం వుంటే ఇవ్వమని అడిగాను. ప్రాధాన్యత వున్న పాత్రలన్నీ అయి పోయాయి అని చెప్పారు. ఆ తర్వాత 1968లో కె.రాఘవ నిర్మించిన జగత్కిలాడీలు,' 'జగత్ జట్టీలు' చిత్రాలలో చిన్నపాత్రలలోనటించాను.

అంతే- ఆ తర్వాత మళ్లీ ఏ చిత్రంలో నటించలేదు. నేను 7వ తరగతి చదివే వయసునుంచి డ్రామాలు అంటే మహాపిచ్చి-చదువు ప్రక్కన పెట్టి నాటకాలు ఆడుతూ వుండేవా డిని, మాకు పెనుగొండ ఫ్యాన్స్ డ్రమెటిక్ అసోసియేషన్ అన్న సంస్థ వుండేది. దీనిద్వారా అనేక నాటకాలు ఆడేవాళ్లం. నా ఆసక్తిని మా నాన్నగారు నిరు త్సాహపరిచినా మా బావగారు మాత్రం ప్రోత్సహించేవారు. అయితే ఆయన కాలం చేయడంతో సినిమా నటుడ్ని కావాలన్న నా కోర్కె అలా రెండు చిన్నపాత్రలు వేసి తీర్చుకున్నాను. ఇదంతా ఎందుకు చెప్పాల్సిన వచ్చిందంటే మా నాన్న నన్ను సిని మారంగానికి వెళ్లవద్దని ఎలా చెప్పారో సరిగ్గా నేను మా పెద్దబ్బాయి చిరంజీవిని వద్దన్నాను. బి.కాం. తరువాత ఐ.ఏ.ఎస్ కాని, ఐ.పి.ఎస్ కాని చదవమని చెప్పాను. గతంలో పాండీబజారుకు ఎప్పుడైనా వెడితే సినిమాలలో వేషాలు లేక తిరిగేవాళ్లను అనేకమందిని చూసేవాడిని. మా వాడు అలా కాకూడదు. మంచి ఆఫీసరుగా దర్జాగా వుండాలి అని ఆశపడ్డాను. అయితే చిరంజీవికి పట్టుదల ఎక్కువ. 'పునాది రాళ్లు' చిత్రంలో సినిమారంగప్రవేశం చేశాడు. ప్రారంభంలో అతను నటించిన చిత్రాలు చూసి- ఇదేం నటన అనుకొనేవాడిని. నటుడుగా రాణిస్తాడా? అన్న అపనమ్మకం కూడా నాలో అధికంగా వుండేది. అయితే 'ఐ లవ్ యు' చిత్రం చూసిన తరువాత నా ఆలోచనావిధానంలో మార్పు వచ్చింది. చిరంజీవి నటుడుగా నిలదొక్కుకోగలడు అన్న నమ్మకం కలిగింది. అచేతనంగా మంచంపై పడివున్న హీరోను హీరోయిన్ అగౌరవపరిచే సన్నివేశంలో హీరో ముఖంలో చూపించే హావభావాలు చూసి ఒక మెచూరిటి కళాకారుడు చిరంజీవిలో నాకు కన్పించాడు.

ఆనాటినుంచి చిరంజీవిని ప్రోత్సహించటం ప్రారంభించాను. అయితే ప్రారంభంలో విలన్ పాత్రలు వేస్తుంటే వద్దని చెప్పాను హీరో వేషాలు కాకపోయినా




## తల్లి కాబోతున్న హీరోయిన్

హీరోయిన్ చిత్ర శుక్ల.. తెలుగులో మా అబ్బాయి అనే సినిమాతో ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. పక్కింటి తెలుగు అమ్మాయి మాదిరి ఉండటంతో తెలుగులో చిత్ర శుక్లకు వరుసగా అవకా శాలు వచ్చినా అనుకున్న గుర్తింపు మాత్రం రాలేదు. తెలుగులో రం గుల రాట్నం, సిలీ ఫెలోస్, తెల్లవారితో గురువారం, పక్కా కమ ర్షియల్, ఉనికి, హంట్ తదితర చిత్రాల్లో నటించింది. మధ్యప్ర దేశ్‌కు చెందిన చిత్ర శుక్ల గతేడాది డిసెంబర్‌లో పోలీసు ఆఫీసర్ వైభవ్ ఉపాధ్యాయ్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. ఈ నేపథ్యం లోనే తాజాగా తాను తల్లి కాబోతున్నట్లు సోషల్ మీడియా వేదిక గా తెలిపింది. తన సీమంతం ఫోటోలు షేర్ చేసి తల్లి కాబోతున్న ట్టు తెలిపింది చిత్ర శుక్ల. కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య సంప్రదాయబద్ధంగా ఈ వేడుకను సెలబ్రేట్ చేసినట్లుగా కనిపిస్తోంది. చిత్ర శుక్ల తన సీమంతంకు సంబంధించిన ఫోటోలను షేర్ చేయడంతో అవి వైరల్ గా మారాయి. దీంతో ఈ విషయం తెలుసుకున్న నెటిజన్లు ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

– తెలుగు 360.కామ్ సౌజన్యంతో...

## సీఎం నిధికి ఆర్పీల సాయం రూ.2.30 లక్షలు





(సత్యంన్యూస్,శ్రీకాకుళం)

విజయవాడ వరద బాదితల సాహోయార్ధం అర్బన్ పరిధిలోని స్వయంశక్తి సంఘాల రిసోర్స్ పర్సన్లు సీఎం సహాయ నిధికి రూ.2.30 లక్షలు విరాళాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్‌కు బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విజయవాడ వరద బాధితుల కష్టాలు వర్ణణాతీతమన్నారు. సర్వం కోల్పోయి నిరాశ్రయులుగా మిగిలారన్నారు. కట్టుబట్టలతో మిగిలిన తోటివారికి తోచిన సాయం అందించేందుకు ముందుకు వచ్చిన స్వయంశక్తి సంఘాల ఆర్పీలకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. మెప్మా అందించిన మొత్తాన్ని మిషన్ డైరక్టర్ మెప్మాకు ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ ద్వారా సీఎం సహాయనిధికి జమ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రెడ్డి గిరిజాశంకర్, మెప్మా సీఎంఎం ఎస్ వెంకటరావు, రిసోర్స్ పర్సన్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## అలుపెరుగని ప్రజా పాలకుడు సీఎం చంద్రబాబు

(సత్యంన్యూస్,శ్రీకాకుళం)




అలుపెరుగని ప్రజాపాలకుడు సీఎం చంద్రబాబునాయుడని టీడీపీ నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వరద భీభత్సంపై అందరి సహకారంతో ధీటుగా ఎదుర్కొని విజయం సాధించారన్నారు. 10 రోజులుగా వరద మంపు ప్రాంతాల్లో బాధిత ప్రజలకు అండగా ఉంటూ భరోసా కల్పించే చర్యలు చేపట్టారని పేర్కొన్నారు.ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రజాపక్షాన నిలబడి నిబద్ధతతో, నిజాయితిగా పనిచేస్తున్నారని తెలిపారు. అపారమైన మేధస్సు, అనుభవంతో అనుక్షణం చంద్రబాబు విపత్తును రేయంబవళ్లు శ్రమించి ఎదుర్కొన్న తీరు అద్భుతమన్నారు. మంపు ప్రాంతాల్లో నిరంతరం శ్రమించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు లోకేష్, అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడు, నీటి పారుదల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు కూటమి ప్రజాప్రతినిధులు, నాయకులు, అనునిత్యం ప్రజాపక్షాన శ్రమిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. వరద ప్రాంతాలో సహాయ చర్యల్లో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

## శుచి, రుచికరమైన ఆహారాన్ని అందించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నేటి పోటీ ప్రపంచంలో ప్రజలు ఎక్కువగా హెూటల్ ఫుడ్‌లపైనే ఆధారపడుతున్నారని, వారికి రుచి, శుచికరమైన ఆహారాన్ని అందించి వారి నమ్మకాన్ని నెలబెట్టుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ హోటల్ యాజమానులకు సూచించారు. నగరంలోని పాతబస్టాండ్‌లో రొనంకి యుగంధర్ ఆధ్వర్యంలో ప్రారంభించిన రాజా దర్బార్ మిలటరీ హోటల్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కస్టమర్లతో మర్యాదపూర్వకంగా మసలుకుంటే ఏ వ్యాపారమైన దిన దినాభివృద్ధి చెందుతుందన్నారు. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు నగరానికి వివిధ పనులపై వస్తూ హోటళ్లలో భోజనాలు చేస్తున్నారని, కావున వారికి కావల్సిన ఆహారాన్ని సకాలంలో అందజేసి వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మెండ దాసునాయుడు, మాదారపు వెంకటేష్, కోర్ను ప్రతాప్, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



## విద్యార్థులను అభినందించిన ఐఐఐటీ డైరెక్టర్



(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

ఈ నెల 14,15 తేదీలలో భీమిలిలో జరగనున్న అండర్-16 అండర్-18 అబౌ అండర్ 18 పోటీలకు రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైన ఐఐఐటీ విద్యార్థులను డైరెక్టర్ బాలాజీ బుధవారం అభినందించారు. ఎంపికైన 24మంది విద్యార్థులు విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ నెల 9,10లో జరిగిన ఆన్లైన్ యోగా పోటీలలో విజయం సాధించిన రాష్ట్రస్థాయి యోగా పోటీలకి ఎంపి కైన ఐఐఐటి విద్యార్థులును అబినందించారు. భీమిలిలో జరిగిన యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీలలో ఈ నెల 14, 15 తేదీలో రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నాయన్నారు. యూనివర్సిటీకి సంబంధించి 24మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి మునిరామకృష్ణ, డీన్ కోర్లమోహన్ కృష్ణ చౌదరి, యోగా విభాగపతి డాక్టర్ ఈశ్వరరావు,యోగా అధ్యాపకులు అర్చన, ధనంజయరావు వెల్ఫేర్ డీన్ గేదెల రవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతుల ఖాతాలో రూ.20వేలు జమ చేయాలి

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అన్నదాతకు పెట్టుబడి సాయంగా రూ. 20 వేల తక్షణమే రైతుల ఖాతాలలో జమ చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, కౌలురైతులసంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్నదాత పెట్టుబడి సాయం రూ. 20 వేలు వెంటనే ఇవ్వాలని, పెండింగ్‌లో సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేయాలని,నారాయణపురం భూసాగుదారులకు సాగు హక్కులు కల్పించాలని రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చిలకపాలెం గ్రామ సచివాలయం కార్యదర్శికి బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయానికి పెట్టుబడులు కోసం ప్రైవేటు వడ్డీవ్యాపారులు చుట్టూ తిరుగుతున్నారన్నారు. పంట పెట్టుబడులు కొరకు రైతు భరోసా సాయం కోసం రైతులు ఎదురు చూస్తున్నారన్నారు. చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతులు ఎదుర్కొనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పంటలకు కనీస మద్దతుధర రైతులకు అందేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. కరువు, వరదల కారణంగా నష్టపోయిన పంట లకు భీమా చెల్లించాలని డిమాండ్ చేసారు. తోటపల్లి కాలువ పూడిక లు తీసి సాగునీరు వచ్చే విధంగా చర్యలు తీసుకొని ఆయకట్టు రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. రైతాంగానికి రూ. 2 లక్షలు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు తోనంగి నందోడు, కోరాడ.అప్పలరాజు, బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.



# విపత్తుల్లో బ్యాంకర్ల సహకారం అవసరం

### డీసీసీ సమావేశంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్

(సత్యంన్యూస్,శ్రీకాకుళం)

పకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, సమాజ ఆర్థికాభివృద్ధితోపాటు జిల్లా ఆర్థిక ప్రగతిలో బ్యాంకర్ల భాగస్వామ్యం, సహకారం అవసరమని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన బ్యాంకర్స్‌తో పాటు డిస్ట్రిక్ట్ కన్సల్టెటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని బ్యాంకులకు నిర్దేశించిన ఋణ లక్ష్యాలు, సాధించిన ప్రగతిని ఆయా బ్యాంకుల ప్రతినిధులతో సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల వరదల వల్ల సంభవించిన నష్టాన్ని అంచనా వేస్తున్నామన్నారు. వరదలను ప్రకృతి వైపరీత్యంగా ప్రకటించామన్నారు. బ్యాంకర్లు సమర్థవంతంగా పని చేస్తేనే ఆర్థిక వ్యవస్థ మరింత దృఢంగా ఉంటుందన్నారు. జిల్లా మూడు ప్రకృతి వైపరీత్యాలకు గురైందన్నారు. పాక్షికంగా రోడ్లు, భవనాలు, కెనల్స్ దెబ్బ తిన్నాయన్నారు. జిల్లాలో సంభవించిన ప్రకృతి వైపరీత్యాల నష్టాలపై శాఖల వారిగా ఆరా తీశారు. జిల్లాలో 55 గృహాలు దెబ్బ తిన్నట్లు నివేదికలు వచ్చాయని వాటిని పరిశీలించాల్సి ఉందన్నారు. జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ కౌలురైతులకు లోన్లు మంజూరు విధానంపై ఒక వారం పాటు అవగాహన సదస్సు ఏర్పాటు చేయాలని కోరారు. ఎల్డీఎం ఎం.సూర్యకిరణ్ మాట్లాడుతూ వలస రైతుల సహాయార్థం వ్యవసాయశాఖ అధికారులు బ్యాంకులను సంప్రదించాలని వారికి బ్యాంకర్లు శతశాతం సహకరించాలని కోరా రు. సమావేశంలో ఆర్ఎం హసీబ్, యూనియన్ బ్యాంక్ ఆర్ హెచ్ వెంకట్ తిలక్ మాట్లాడుతూ రైతులకు బ్యాంకుల ద్వారా సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో నాబార్డ్ డీడీఎం రమేష్ కృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీధర్, డిఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్, జిల్లా ఉద్యాన అధికారి ఆర్.వి.ప్రసాద్, పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.




## వరద బాధితులకు కాకినాడ ఆదిత్య సాయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విజయవాడ వరద బాధితులకు స్థానిక కాకినాడ ఆదిత్య జూనియర్ కాలేజ్ విద్యార్థులు తమవంతు సహాయంగా నిత్యావసర సరుకులు, బిస్కెట్ ప్యాకెట్స్, వాటర్ బాటిల్స్, బట్టలను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల సెక్రటరీ ఎం.దీపక్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్ బి.ఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ ఎం.ఢిల్లీశ్వరరావు అభినందిస్తూ విపత్తు సమయంలో నిరాశ్రయులైనవారిని ఆదుకోవడంలో విద్యార్థులు మందుకురావడంపై హర్షం వ్యక్తం చేశారు.



## 8 రోజుల్లో రెండు కోట్ల సభ్యత్వాలు

### - సభ్యత్వ జిల్లా కన్వీనర్ చల్లా వెంకటేశ్వర రావు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించిన ఎనిమిది రోజుల్లోనే జాతీయస్థాయిలో 2 కోట్ల సభ్యత్వాలు నమోదయ్యాయని ఆ పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, సభ్యత్వ నమోదు కమిటీ జిల్లా కన్వీనర్ చల్లా వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 45 రోజుల్లో 10 కోట్ల సభ్యత్వాల లక్ష్యాన్ని దాటుతామని తెలిపారు. జిల్లాలో పెద్దఎత్తున సభ్యత్వ నమోదు జరుగుతుందన్నారు. వర్షాల కారణంగా కొంత జాప్యం ఉన్నా రాబోయే రోజుల్లో అనుకున్న లక్ష్యం చేరుతారన్నారు. సభ్యుల పూర్తి వివరాలతో, ఆన్లైన్ ద్వారా సభ్యత్వ నమోదు చేస్తు న్నామన్నారు. పార్టీ నియమావళి ప్రకారం ప్రతి ఆరు ఏళ్లకు ఒకసారి సాధారణ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. 8800002024 నంబరుకు మిస్డ్‌కాల్ ఇవ్వడం ద్వారా, ఒక లింక్ ఎస్.ఎమ్.ఎస్ ద్వారా వస్తుందన్నారు. ఆ లింక్ ఓపెన్ చేసి, సభ్యుల వివరాల నమోదు చేసిన తరువాత, బీజేపీ సభ్యతం కార్డు డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

## ఈనెల 14న ఘంటసాల గానావదాన పాటలు


(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈనెల 14న సాయంత్రం 5.30గంటలకు బాపూజీ కళామందిర్ లో డాక్టర్ సయ్యద్ రహమతుల్లా ఆధ్వర్యంలో ఘంటసాల గానావదాన పాటలు, లఘునాటికలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు శ్రీ సుమిత్ర కళాసమితి అధ్యక్షులు ఇప్పిలి శంకర శర్మ బుధవారం నిర్వహించిన మిడియా సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో 14 మంది కళాకారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఘంటసాల జీవిత చరిత్రలో కొన్ని ముఖ్య ఘట్టాలతో లఘునాటికలు ప్రదర్శించనున్నట్టు తెలిపారు. కార్యక్రమానికి సభాధ్యక్షులుగా డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, ముఖ్య అతిథిగా రామలింగేశ్వరరావు, కార్యక్రమ నిర్వాహకులుగా పులఖండం శ్రీనివాసరావు వ్యవహరిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమానికి కళాకారులు, కళాభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి గుత్తు చిన్నారావు, కళాసమితి ప్రతినిధులు నక్క శంకర్రావు, మండవల్లి రవి, నిక్కు హరి సత్యనారాయణ, మెట్ట పోలినాయుడు, ఎం.వరలక్ష్మి, జ్యోతి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## సర్వేయర్ల వరద సాయం రూ.80లక్షలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సచివాలయం సర్వేయర్ల ఒకరోజు మూల వేతనం రూ.80లక్షలు విజయవాడ వరద బాధితులకు విరాళంగా అందించారు. మంగళవారం రాత్రి డిప్యూటీ సీఎం, పంచాయితీరాజ్ శాఖా మంత్రి పవన్‌కళ్యాణ్‌ను విజయవాడలో కలిసి గ్రామ సర్వేయర్స్ సంఘం నాయకులు రూ.80 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన రాష్ట్ర అధ్యక్షులు బూరాడ మధుబాబు మాట్లాడుతూ వరదల కారణంగా రాష్ట్రంలో పలు ముంపు ప్రాంతాల ప్రజలకు తమ వంతుగా పంచాయతీరాజ్ శాఖ అధీనంలోని విధులు నిర్వహిస్తున్న గ్రామ, వార్డు సచివాలయ సర్వేయర్లు ఒకరోజు మూల వేతనం నుంచి విరాళంగా రూ.80లక్షల సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ గ్రామ సర్వేయర్స్ సంఘం తరపున ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌తో గ్రామ, వార్డు సచివాల యంలో ఉద్యోగుల సమస్యలపై వివరించారు. పవన్‌ను కలిసిన వారిలో స్టేట్ స్పోర్ట్స్ సెక్రటరీ కిరణ్‌కుమార్, జిల్లా అధ్యక్షులు అయ్యప్పలనాయుడు పాల్గొన్నారు.




## 15న విశాఖ ఉక్కు కవి సమ్మేళనం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రజా ఉద్యమాలతో, ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేసే దిశగా, జరుగుతున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఈనెల 15న కవి సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్టు అరసం జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి నల్లి ధర్మారావు, చింతాడ కృష్ణారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15న ఉదయం 10 గంటలకు స్థానిక గరిమెళ్ళ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. కవులు నేరుగా సమావేశానికి హాజరై, తమ కవితలను చదవాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ సాహితీ, సంస్కృతిక, ప్రజా సంఘాల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

## 12న రామ్‌ప్రసాద్ జయంతి ఉత్సవం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



మృదంగమే జీవితంగా శాస్త్రీయ సంగీతంలో ఎంతోమంది వర్ధమాన కళాకారులను జిల్లాకి పరిచయం చేసిన మృదంగ భీష్మ బిరుదుని సార్ధకం చేసుకున్న మండ క్రిష్ణ రామ్‌ప్రసాద్76వ జయంతి ఉత్సవం ఈ నెల 12న నిర్వహిస్తున్నట్టు తరిణి క్రిష్ణ స్మారక ధార్మిక సేవా ట్రస్ట్ వ్యవస్థాపక మేనేజింగ్ ట్రస్టీ, చైర్మన్ మండ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. జిల్లా కేంద్ర గ్రంధాలయంలో గురువారం సాయంత్రం 5.30 గంటల నుంచి జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో సాయంత్రం 5.30కు వర్ధమాన కళాకారుల ప్రదర్శన, 7గంటలకు శ్రీకాకుళం మృదంగ మలయామరుతం మావుదూరు సూర్య ప్రసాదరావుకు మండ క్రిష్ణ రామ్‌ప్రసాద్ స్మారక మృదంగ పురస్కారం, సన్మానం చేయనున్నట్టు తెలిపారు. 7.30కు శృతిలయ రంజిని మృదంగ లయ విన్యాసం జరుగుతుందన్నారు. లయ విన్యాస కార్యక్రమం మావుదూరు సూర్య ప్రసాదరావు నిర్వహణలో మండ శ్రీనివాసరావు, బంకుపల్లి దుర్గ శ్రీనివాసశర్మ పాల్గొంటారని తెలిపారు. గాత్ర సహకారం మావుదూరు సత్యనారాయణ శర్మ, శ్రీనివాసరావు వాయులీనంపై వాయు నందన శర్మ సహకరిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాకారులు, కళాభిమానులు, కళాపోషకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

















# పోలవరానికి 'ఇంకుడు' ముప్పు!

మన రాష్ట్రానికి ప్రధాన నీటి వనరులు గోదావరి, కృష్ణా నదులే. ఇంకా చాలా నదులు ఉన్నప్పటికీ వాటి వల్ల పరిమిత ప్రయోజనాలే దక్కుతున్నాయి. కారణం.. గోదావరి, కృష్ణమ్మలా ఇది జీవనదులు కాకపోవడమే. వర్షాకాలంలో క్యాచ్‌మెంట్ (నదీపరివాహక ప్రాంతాలు) ఏరియాల్లో భారీ వర్షాలు కురిసినప్పుడు వరద రూపంలో నదుల్లోకి నీరు వస్తుంది. వర్షాలు తగ్గిపోగానే చాలా నదుల్లో నీరు ఎండిపోతుంటుంది. కానీ కృష్ణా గోదావరి నదుల్లో సీజనుతో సంబంధం లేకుండా తక్కువ పరిమాణంలో అయినా నీరు అందుబాటులో ఉంటుంది. అందుకే వీటిని జీవనదులు అంటారు. ఏటా లక్షలాది ఎకరాలను సస్యశ్యామలం చేస్తూ ఆంధ్రప్రదేశ్ పాలిట జీవధారగా పేరొందిన గోదావరి ఇప్పుడు ఒక సమస్య ఎదుర్కొంటోందని నిపుణుల నివేదికలు హెచ్చరిస్తున్నాయి. అందే ఇంకుడు సమస్య. నదిలో నీరు ప్రవాహ సమయంలోనే భూమిలోకి ఇంకిపోతోందని, ఇది భవిష్యత్తులో ముప్పుగా పరిణమించవచ్చని అంటున్నారు. గోదావరిపై నిర్మించిన ప్రాజెక్టులకు ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టుకు నికర జలాలు అందుకుండాపోయే ప్రమాదం ఉందంటున్నారు. వర్షాకాలంలో వరదలతో ముంచెత్తే గోదావరికి ఈ సమస్య ఏమిటి? నమ్మదగినదిగా లేదని అనిపించవచ్చు. కానీ వరదలు సంభవించేది వర్షాకాలంలో మాత్రమే. మిగతా సీజన్లలో నదిలో నీరు అంతంతమాత్రంగానే ఉంటుంది. అది కూడా ఇంకిపోతే నదిపై ఆధారపడిన నీటిపారుదల, తాగునీటి పథకాలు వట్టిపోతాయని అంటున్నారు.



- ప్రధానంగా కోయిదా నుంచి పోలవరం మధ్యే ఈ సమస్య
- నదీగర్భంలోని భూమి పొరల్లో ఇంకిపోతున్న నీరు
- రోజుకు సగటున 28 టీఎంసీలు మాయం
- దీనివల్ల భవిష్యత్తులో ప్రాజెక్టుకు ఇబ్బంది
- కేంద్ర జలసంఘం హెచ్చరించినా పట్టించుకోని ప్రభుత్వాలు

సాధారణంగా నదులన్నీ పర్వత ప్రాంతాల్లో పుట్టి వేల కిలోమీటర్లు ప్రయాణిస్తూ, ఆ మార్గంలో ఉన్న చిన్న చిన్న వాగులు, వంకలను.. ఆయా ప్రాంతాల్లో కురిసే వర్షాల నీటిని తమలో కలుపుకుంటూ పెద్ద నదులుగా మారుతుంటాయి. చివరికి సముద్రంలో కలిసిపోతుంటాయి. అధికశాతం నదులు వర్షాకాలంలోనే జలకళ సంతరించుకుంటాయి. మిగతా కాలాల్లో నీరులేక బోసిగా కనిపిస్తుంటాయి. చాలా నదుల నీరు భూమిలోనే ఇంకిపోతుంటుంది. ఆ కారణంగానే చాలా నదులు, ఏర్లు కాలగమనంలో కలిసిపోయి చరిత్రగానే మిగిలిపోతుంటాయి. ఇంకుడు స్థాయికి మించి వరద ప్రవాహం ఉన్న నదులు మాత్రమే అన్ని కాలాల్లోనూ నీటితో కళకళలాడుతుంటాయి. అటువంటి నదుల్లో దక్షిణ భారతదేశంలోని గోదావరి ప్రముఖమైనది. మహారాష్ట్రలోని నాసిక్‌లో పుట్టి ఆ రాష్ట్రంతోపాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లను సస్యశ్యామలం చేస్తున్న గోదావరి నదిలో మూడు రాష్ట్రాల్లోనూ పలు భారీ నీటిపారుదల ప్రాజెక్టులు, విద్యుత్ ప్రాజెక్టులు, వందలాది గ్రామాలు, పట్టణాల పరిధిలో తాగునీటి ప్రాజెక్టులు నిర్మించారు. ఇప్పుడు మన రాష్ట్రంలో పోలవరం పేరుతో భారీ బహుళార్థసాధక ప్రాజెక్టు నిర్మిస్తున్నారు. దీని ద్వారా సాగు, తాగు నీటితోపాటు విద్యుత్ ఉత్పాదన చేపట్టాలన్నది లక్ష్యం. కానీ గోదావరి నీరు ఇంకిపోతున్న పరిస్థితి ఉందని నీటిపారుదల రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాధారణంగా నదుల ఉపరితలంలో ఉన్న నీరు ఎండ వేడి కారణంగా కొంత ఆవిరి అయిపోతుంటుంది. అయితే అది చాలా తక్కువ పరిమాణం. అలాగే ప్రవాహ సమయంలో మరికొంత నీరు భూమి పొరల్లోకి ఇంకిపోతుంటుంది. అది సాధారణ స్థాయిలో ఉంటే పెద్దగా పట్టించుకోవాల్సిన పని లేదు. కానీ గోదావరి నీరు సాధారణానికి మించి ఇంకిపోతోందని అధ్యయనాల్లో తేలింది.

## మూడు దశాబ్దాల అధ్యయనం

గోదావరి నీరు భారీగా ఇంకిపోతున్న విషయాన్ని నీటిపారుదల ఇంజినీరింగ్ నిపుణులు ఆషామాషీగా చెప్పడంలేదు. సుమారు మూడు దశాబ్దాలపాటు గోదావరి నీటి పరిమాణాన్ని అధ్యయనం చేసి విశ్లేషించి దీన్ని నిర్ధారించారు. దీనిపై మరిన్ని పరిశోధనలు జరిపి, నివారణ చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు. 1977 నుంచి 2006 వరకు అంటే గోదావరి నీటి ప్రవాహాన్ని అధ్యయనం చేసిన తర్వాత కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) ఈ నిర్ధారణకు వచ్చింది. పోలవరానికి 52 కిలోమీటర్ల ఎగువన ఉన్న కొయిదా నుంచి జరిపిన ఈ పరిశీలనలో ప్రతి సంవత్సరం భారీ మొత్తంలో గోదావరి నీరు అదృశ్యమవుతున్నట్లు నిర్ధారించారు.

* 1983 ఆగస్టు 15న కోయిదా వద్ద గోదావరిలో 58,616 క్యూసెక్కుల ప్రవాహం ఉండగా అది దిగువన 52 కిలోమీటర్ల దూరంలో ఉన్న పోలవరం వద్దకు వచ్చే సరికి 40,176 క్యూసెక్కులకు తగ్గినట్లు గుర్తించారు.

* నీటి పరిమాణం విషయానికొస్తే 1986లో కోయిదా వద్ద నదిలో 1,552 టీఎంసీల నీరు ఉండగా పోలవరం వద్దకు వచ్చే సరికి 1,345 టీఎంసీలకు తగ్గిపోయింది. అంటే ప్రవాహ సమయంలోనే 207 టీఎంసీల నీరు తగ్గిపోయినట్లు తేలింది.

* అదే సమయంలో కోయిదాకు ఎగువన ఉన్న పేరూర్ గేజ్ నుంచి నీటి ప్రవాహంలో ఎటువంటి తగ్గుదల కనపించకపోగా వాగులు, వంకల కలవడం వల్ల నీటి పరిమాణం పెరగడాన్ని గుర్తించారు. పేరూర్ గేజ్ వద్ద 2,369 టీఎంసీ నీరు ఉండగా అది కోయిదాకు వచ్చేసరికి 3,218 టీఎంసీలుగా నమోదైంది. అంటే దాదాపు 849 టీఎంసీలు పెరిగింది. దీని ప్రకారం చూస్తే సమస్య అంతా కోయిదా నుండి పోలవరం వరకు ఉన్న ప్రవాహమార్గంలోనే ఉన్నట్లు నిర్ధారించారు.

వరద తీవ్రతతో సంబంధం లేకుండానే కోయిదా, పోలవరం మధ్య ప్రతి ఏటా భారీ మొత్తంలో నీళ్ల అదృశ్యమవుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వానికి చాలాకాలం క్రితమే నిపుణులు నివేదిక రూపంలో తెలియజేశారు. కోయిదా-పోలవరం మధ్య డ్యామ్‌లు, ఎత్తిపోతల పథకాలు లేవు. పైగా కొన్ని వాగులు, వంకల నుంచి అదనంగా నీరు చేరుతోంది. ఈ లెక్కన పోలవరానికి వచ్చేలోపు నీటి ప్రవాహం పెరగాలి తప్ప తగ్గకూడదు. దానికి భిన్నంగా రోజూ సగటున 28.25 టీఎంసీల నీరు మాయమవుతున్నదని నివేదికలో పేర్కొన్నారు.

## ఆ నీరంతా ఏమవుతోంది?

నీటి పరిమాణం తగ్గడానికి కారణాలేమిటి? ఆ నీరు అంతా ఏమవుతోందన్న ప్రశ్నలకు సమాధానంగా కేంద్ర జలసంఘం నిపుణులు కొన్ని కారణాలు వెల్లడించారు. గోదావరి ప్రవాహ సమయంలో పెద్ద మొత్తంలో నీరు భూమి లోపలి పొరల్లోకి(బిగ్ డీప్ బెడ్ ప్రొఫైల్) ఇంకి పోతున్నదని పేర్కొన్నారు. అయితే కోయిదా నుంచి పోలవరం మధ్య ఏ ప్రాంతాల్లో ఈ ప్రక్రియ జరుగుతోందన్నది నిర్దిష్టంగా గుర్తించి అక్కడ ఇంకిపోకుండా అరికట్టడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని నివేదికలో సూచించారు. పోలవరానికి 200 కిలోమీటర్ల ఎగువన ఉన్న ఖమ్మం జిల్లాలోని గుండ్లవాగు ప్రాజెక్టు వద్ద కూడా ఇదే రకమైన పరిస్థితి ఉన్న విషయాన్ని జలసంఘం ప్రస్తావించింది. అయితే పోలవరం ప్రాజెక్టుతో పోలిస్తే గుండ్లవాగు వద్ద భూమిలోకి ఇంకుతున్న నీటి పరిమాణం చాలా తక్కువ. ఎన్ని ప్రయత్నాలు చేసినా దాన్ని పూర్తిస్థాయిలో అరికట్టలేకపోయిన విషయాన్ని కూడా నివేదికలో ప్రస్తావించారు. ఈ రెండు ప్రాంతాల్లోనూ భూమి లోపలి పొరల నిర్మాణం దాదాపు ఒకేలా ఉందని పేర్కొన్నారు.

## ఎత్తు పెరిగేకొద్దీ సమస్య తీవ్రం

పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్ల (150 అడుగులు) ఎత్తులో కడితే రోజుకు 32.5 టీఎంసీలు, 41.15 మీటర్ల(135 అడుగులు) ఎత్తులో కడితే రోజుకు 24 టీఎంసీల నీరు గోదావరి నుంచి మాయమవుతుందని నివేదిక చెబుతోంది. ఈ అంశాలను పోలవరం డీపీఆర్‌లోనూ ప్రస్తావించినా ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తు కడితే రాష్ట్రంలో ముంపు ప్రాంతం బాగా పెరగడంతో పాటు పొరుగు రాష్ట్రాలతో సమస్యలు వస్తున్నాయి. అదే 41.15 మీటర్లకు పరిమితమైతే ఈ సమస్యలు గణనీయంగా తగ్గుతాయి. కానీ నదీ గర్భంలోనే భూమిలోకి నీరు ఇంకిపోవడం మాత్రం కొనసాగుతుంది. ఈ సమస్యను పరిష్కారానికి పోలవరం కుడి, ఎడమ కాలువల సామర్థ్యాన్ని మరింత పెంచి, గోదావరిలో వరద ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఎక్కువ నీటిని తీసుకోవడం వంటి ప్రత్యామ్నాయాలను ఆలోచించాలని నిపుణులు చెబుతున్నారు. 45.72 మీటర్ల ఎత్తుతో ప్రాజెక్టును నిర్మిస్తే భూగర్భంలో పెను మార్పులు జరిగి దిగువన ఉన్న ధవళేశ్వరం ప్రాజెక్టుతో పాటు జనావాసాలకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.

**- డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి**



## నిమజ్జనం సమయంలో జాగ్రత్త

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గణపతి నవరాత్రుల నేపథ్యంలో నిమజ్జనం జరుగుతున్న సందర్భంగా పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా, జాగ్రత్తగా ఉండాలని సామాజికవేత్త అలపాన త్రినాధ్‌రెడ్డి కోరారు. నీటికుంటలు, చెరువులు, బావులు, నది తదితర నీటి ప్రవాహాల్లో పిల్లలు అప్రమత్తంగా ఉండేందుకు తల్లిదండ్రులే వారిని కనిపెట్టుకొని ఉండాలని సూచించారు. లేకపోతే కడుపుకోతకు మనమే బాధ్యత వహించాల్సి వస్తుందని త్రినాథ్‌రెడ్డి హెచ్చరించారు. ప్రతి ఏడాది నిమజ్జన కార్యక్రమంలో బిడ్డల్ని కోల్పోయిన తల్లిదండ్రులను గుర్తు చేసుకొని ఈ ఏడాది పిల్లలకు ఎటువంటి నష్టం జరగకుండా మన పిల్లలను మనమే జాగ్రత్తగా చూసుకోవాలని, ఈ విషయంలో మండప కమిటీలు కూడా బాధ్యత వహించాలని త్రినాథరెడ్డి కోరారు.

## వర్గీకరణ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

దేశ అత్యున్నత న్యాయస్థానం ఏబీసీడీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దళిత మహాసభ గౌరవ అధ్యక్షుడు. పి.బెంజిమాన్ అన్నారు. వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై బుధవారం స్థానిక అంబేద్కర్ జంక్షన్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఇలిసిపురంలోని అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో దళిత మహాసభ రాష్ట్ర నాయకులు డాక్టర్ గంజి ఆర్ ఎజ్రా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కొన్ని రాజకీయ పార్టీలు అధికారం కోసం ఐక్యంగా ఉన్న కులాల్లో చిచ్చుపెట్టి లబ్ధి పొందాలన్న ఆలోచనతో పాలన కొనసాగిస్తున్నాయని బెంజిమాన్ మండిపడ్డారు. ఈ సమస్యపై రాష్ట్రపతిని త్వరలోనే కలిసి దళితులకు జరిగే నష్టంపై వివరిస్తామన్నారు. త్వరలో ఛలో ఢిల్లీ నిర్వహించనున్నట్లు మాల మహానాడు రాష్ట్ర కన్వీనర్ ఎన్.భరత్ భూషణ రాజు, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకులు పోతల దుర్గారావు తెలిపారు. కార్యక్రమంలో దళిత ఉద్యమ సంఘ నాయకులు బోకర నారాయణరావు, బోనెల అప్పారావు, అంపోలు ప్రతాప్, డి.రాం బాబు, ఎన్.శ్యామ్‌సుందర్, శీర రమేష్, సర్పంచ్ ఎస్.నాగరాజు, న్యాయవాది బి.మురళీకృష్ణ, వై.గడ్డెయ్య, గోవింద్, కె.ఎన్.మూర్తి, రాము, జగన్ పాల్గొన్నారు.




## పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

పర్యావరణ పరిరక్షణకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని, విపత్తుల నుంచి కాపాడుకొనేందుకు ఏకైక మార్గం మొక్కలు నాటడమని శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్య చంద్రరావు అన్నారు. బుధవారం స్థానిక ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మొక్కలను నాటి, వాటి అవసరాలను పలువురు వక్తలు వివరించారు. జేసీఐ వారోత్సవాల సందర్భంగా జేసీఐ శ్రీకాకుళం మెయిన్, జేసీఐ శ్రీకాకుళం గ్రీన్‌సిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మారథాన్ రన్‌ను ముందుగా ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యచంద్రరావు, జేసీఐ వ్యవస్థాపకులు జెసీ డాక్టర్ జామి భీమశంకర్, ఏపీ వర్కింగ్ జర్నలిస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్‌లు ప్రారంభించారు. ఈ ర్యాలీ ఏడు రోడ్ల కూడలి నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు సాగింది. జేసీఐ శ్రీకాకుళం మెయిన్ అధ్యక్షులు కూన అనిల్ కుమార్, జేసీఐ శ్రీకాకుళం గ్రీన్‌సిటీ అధ్యక్షురాలు బెందాళం వరలక్ష్మి మాట్లాడుతూ జిల్లా కేంద్రాన్ని హరిత వనాల నగరంగా మార్చేందుకు ప్రధాని పిలుపు మేరకు ప్రతీఒక్కరూ తల్లిదండ్రుల పేరుతో మొక్కలు నాటి, వాటి పరిరక్షణకు పాటుపడాలని కోరారు. వారోత్సవాలకు సహకారం అందించిన పీజెడ్పీ సెనేటర్ పవన్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ ఛాంబర్స్ శ్రీకాకుళం ప్రాజెక్ట్ చైర్మన్ టి.ఉషారాణి, ఎస్.విజయలక్ష్మి, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ చైతన్య, కె.జయకృష్ణ, బొడిగి మధు, వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు, కొంక్యాన మురళి, వనిత వాకర్స్ లక్ష్మి, గేదెల ఇందిరా ప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమా మహేశ్వరరావు, జుంబ డాన్స్ దేవి ప్రసాద్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎన్‌సీసీ కెప్టెన్ వై.పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వారికి ఆక్వా కాసుల మేత.. తీరగ్రామాలకు గుండె కోత

(మొదటిపేజీ తరువాయి)

రొయ్యలు సాగు చేస్తున్నవారంతా రాజకీయ పార్టీలకు చెందినవారే. వీరంతా 2019కి ముందు టీడీపీలో ఉండగా తర్వాత వైకాపా అధికారంలోకి రావడంతో కండువాలు మార్చి అధికార పార్టీ నాయకుల చెంతకు చేరిపోయారు. ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో ఉండటంతో కొందరు జనసేన నాయకులుగా, మరికొందరు టీడీపీ నాయకులుగా చెలామణీ అవుతున్నారు.

### 12 మినహా అన్నీ అక్రమ చెరువులే

కోస్టల్ ఆక్వా రెగ్యులేటరీ చట్టాన్ని ఉల్లంఘించడంతో పాటు బంగాళాఖాతం భూభాగంలో (అన్ సర్వే ల్యాండ్‌లో) అనధికారికంగా చెరువులు నిర్మించి రొయ్యలు సాగు చేస్తున్నారు. వీటిని చట్టబద్ధం చేసుకోవడానికి 2021 మార్చి 12 నుంచి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అధికారుల నిర్ణయాలపై పదే పదే న్యాయస్థానాలకు వెళ్లి స్టేఆర్డర్లు తెచ్చుకుంటూ చెరువులను తొలగించకుండా అడ్డుకుంటున్నారు. 2023 జూలై 19న పెద్దగనగళ్లపేట, మోపసు బందర్, జాలారిపేట, కళ్లేపల్లి పరిధిలోని అక్రమ రొయ్యల చెరువులను తొలగించాలన్న న్యాయస్థానం ఆదేశాలను అమలు చేయడానికి పోలీసుల సాయంతో రెవెన్యూ అధికారులు సిద్ధమయ్యారు. కానీ అదే రోజు ఆక్రమార్కులు హైకోర్టులో పిల్ దాఖలు చేయడంతో చెరువుల తొలగింపు ప్రక్రియకు బ్రేక్ పడింది. అదే నెల 26న హైకోర్టు నుంచి రెండు వారాల స్టే తెచ్చుకున్నారు. పిటిషన్లు సాగు చేస్తున్న రొయ్యల చెరువులను మరోసారి పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆ సందర్భంగా కోర్టు జిల్లా ఉన్నతాధికారులను ఆదేశించింది. దానికి సిద్ధమైన అధికారులు 2023 ఆగస్టు 26న కలెక్టర్ ముందు విచారణకు హాజరు కావాలని 27 మంది పిటిషనర్లకు నోటీసులు పంపారు. అయితే అనివార్య కారణాలు అన్న సాకుతో అప్పటి అధికార పార్టీ నాయకుల సూచనలతో ఉన్నతాధికారులు విచారణను వాయిదా వేశారు. దీన్ని అవకాశంగా తీసుకున్న ఆక్రమణదారులు రొయ్యల చెరువుల తొలగిస్తే తీవ్రంగా నష్టపోతామని, అందువల్ల పునఃపరిశీలించాలని కలెక్టర్‌కు మరో వినతిపత్రం ఇచ్చారు. ఈ వ్యవహారంలో రెండు పార్టీలవారు ఏకమై రొయ్యల సాగుకు అడ్డంకులు లేకుండా ముందుకు సాగుతూ వచ్చారు.

### పలుమార్లు స్టేలు.. వాయిదాలు

అక్రమ చెరువుల వల్ల నాగావళి ప్రవాహ దిశ మారుతోందని స్థానికులు ఎప్పటి నుంచో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువులను తొలగించకుంటే వరదల సమయంలో నదీ ప్రవాహం గ్రామాలను ముంచెత్తే ప్రమాదముందని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కొందరు కోర్టును కూడా ఆశ్రయించడంతో జిల్లా ఉన్నతాధికారులు చెరువులను వెంటనే తొలగించాలని 2021 మార్చి 16న మండల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీన్ని ఆక్రమణదారులు న్యాయస్థానంలో సవాల్ చేయగా 2023 ఫిబ్రవరి 28న పిటిషన్ 21420/2021ను కొట్టేస్తూ చెరువుల తొలగింపునకు కోర్టు అనుమతినిచ్చింది. ఆ నోటీసులు అందుకున్న ఆక్రమణదారులు కలెక్టర్ వద్దకు వెళ్లి చెరువుల్లో రొయ్యల సాగు కొనసాగుతోందని, అది పూర్తి అయ్యేవరకు నాలుగు నెలల గడువు తెచ్చుకున్నారు. అది కూడా 2023 జూన్ 28తో పూర్తయింది. దీంతో జూలై 5న ఒకసారి, కోర్టు ఆదేశాలతో జూలై 12న ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి జూలై 19న తొలగించడానికి మరోసారి రెవెన్యూ అధికారులు సిద్ధమయ్యారు. అయితే ఆక్రమణదారులు మళ్లీ కోర్టును ఆశ్రయించి రెండు వారాల స్టే సంపాదించారు. కాగా 2023 జూలై 13న నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ బృందం రొయ్యల చెరువుల ప్రభావిత గ్రామాలతోపాటు నదీ, సముద్రం కలిసే ప్రాంతాన్ని పరిశీలించిన తర్వాత తక్షణమే చెరువులను తొలగించాలని, అనంతరం నివేదిక ఇవ్వాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించింది. కానీ రెవెన్యూ అధికారులు తూతూమంత్రంగా ఆ పని అయ్యిందనిపించి చాలా చెరువులను వదిలేశారు. ఆ తర్వాత సార్వత్రిక ఎన్నికలు హడావుడిలో అధికారులు ఉండిపోవడంతో రొయ్యల చెరువులు ఇప్పటికీ కొనసాగుతున్నాయి.

## జాతీయ తైక్వాండో పోటీల్లో సత్తా చాటాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

తమిళనాడులోని దిండిగల్ వేదికగా ఈ ఈ నెల 14 వరకు జరుగుతున్న రెండో అస్మిత ఉమెన్స్ తైక్వాండో లీగ్-2024 (ఖేలో ఇండియా) జాతీయ స్థాయి పోటీలలో జిల్లా క్రీడాకారులు సత్తా చాటి విజేతలుగా తిరిగి రావాలని ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షులు తైక్వాండో శ్రీను సూచించారు. ఇటీవల తిరుపతి వేదికగా జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారిణిలను ఆయన అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో కూడా రాణించి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. పోటీలకు వెళ్తున్న జిల్లా క్రీడాకారిణులకు వైశ్యరాజు మోహన్, గిడుతూరి వెంకటేశ్వరరావు, ఎం.సుధీర్ వర్మలు ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఎంపికైన ఈ టీంకి కోచ్‌లుగా మజ్జి గౌతమ్, మోర్తా సాయి బాలాజీ వ్యవహరిస్తున్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.